తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

# పరిశ్రమల స్థాపనకు భూముల కొరత..

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్.
### నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టుకి బ్రేక్.
### జిల్లాకు పరిశ్రమలు తెచ్చేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారన్న ఎంపీ.

**ఏలూరు, స్వర్ణ సాగరం**

కొయ్యలగూడెం వద్ద తలపెట్టిన నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటు నిర్ణయం విరమించుకున్నట్లు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. గురువారం ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎంపీ మీడియాతో మాట్లాడారు. 90శాతం మంది రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చినప్పటికీ, కొందరు స్థానిక నేతలు ప్రజల్లో అపోహలు సృష్టించి, ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడంతో సమస్య ఏర్పడిందన్నారు. ప్రస్తుతానికి నేవీ డిపో ప్రాజెక్టు ఏర్పాటు పనులు ఆపివేసినట్లు ఎంపీ స్పష్టం చేశారు.కోకోసిటీఏర్పాటుకుభూముల పరిశీలన జరుగుతోందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కోకో సిటీ ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పిన ఎంపీ, ఎక్కడ పెట్టేది త్వరలోనే నిర్ణయిస్తామని తెలిపారు. ఏలూరు పార్లమెంటులో అభివృద్ధి జరగాలని కోరుకుంటూ పరిశ్రమలు తీసుకువచ్చేందుకు తాను ప్రయత్నిస్తుంటే కొంతమంది అడ్డుపడటం దురదృష్టకరమన్నారు. ఏదేమైనా అభివృద్ధి పనులు ఆగకుండా చూస్తామన్నారు. ఆయిల్ పామ్ పంటకు మంచి భవిష్యత్తు ఉందని, జిల్లాలో పొగాకు సాగు చేస్తున్న రైతులు కూడా కొంతమేర పొగాకు పంటను తగ్గించుకొని, పామాయిల్ పంట వైపు మళ్ళాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఏడాది ఆయిల్ పామ్ గెలలకు గతంలో ఎన్నడూ లేనంత మంచి ధర లభిస్తోందన్న ఎంపీ, భవిష్యత్తులో మరింత ధరలు పెరుగుతాయని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 56 స్మశాన వాటికలకు నిధులు కేటాయించామని, అనేక చోట్ల నిర్మాణ పనులు కూడా మొదలయ్యాయని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. నూజివీడు ప్రాంతంలో ఇటీవలే కొన్ని పరిశ్రమలు వచ్చాయని, మరికొన్ని పరిశ్రమలు తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఏంపి వెల్లడించారు. పరిశ్రమల స్థాపనకు జిల్లాలో భూముల కొరత అడ్డంకిగా మారిందన్నారు. ఏలూరులో పబ్లిక్ లైబ్రరీ పునర్మాణ పనులు కూడా ఈ సంవత్సరంలోనే మొదలు పెడతామని అన్నారు. జిల్లాలో బీసీ హాస్టల్స్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ద్వారకాతిరుమల్లో ఒక కళ్యాణమండపం నిర్మాణానికి నాయి బ్రాహ్మణుల సంఘం తరపున కోరగా, నిబంధనలు సవరించి అనుమతులు మంజూరు చేయాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరామని, త్వరలోనే అనుమతులు వస్తాయని ఆశిస్తున్నానన్నారు. ఏలూరు పార్లమెంటులో ప్రతి పల్లెకి రోడ్డు సౌకర్యం ఉండాలనేది తన లక్ష్యం అన్న ఎంపీ, ఇప్పటికే అనేక గ్రామాల్లో రోడ్లు నిర్మించామని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా మరికొన్ని రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం ఏలూరు ఎంపీ క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు 22 లక్షల విలువైన సీఎంర్ఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత 23 నెలల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో వచ్చిన 1200 మంది లబ్ధిదారులకు సీఎంర్ఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించగలిగామన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ అనంతరం ఎంపీ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. గ్రీవెన్స్ కోసం ప్రజలు భారీగా తరలి రావడంతో ఎంపీ క్యాంపు కార్యాలయం కిక్కిరిసిపోయింది. వివిధ నియోజకవర్గాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎంపీ, వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించే ప్రయత్నం చేశారు. గ్రీవెన్స్ కార్యక్రమం ముగిసిన అనంతరం పెదపాడు మండలం కొత్తూరు వెళ్ళిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఈరోజు ఉదయం మరణించిన గ్రామ టీడీపీ నేత గోవిందరావు తండ్రి ఆవల పెద్ద సోమయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు.



# మానవత్వం చాటిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్..

### గుండెపోటుతో రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని సొంత వాహనంలో ఆసుపత్రికి తరలింపు.

**ఏలూరు, స్వర్ణ సాగరం**

ప్రజా ప్రతినిధి అంటే ఒక హోదా మాత్రమే కాదు, బాధ్యతతో కూడిన ప్రజా సేవ అని నిరూపించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో దెందులూరు మండలం, గంగన్నగూడెంలో ఒక వివాహ కార్యక్రమానికి వెళ్ళి ఏలూరు వస్తున్న ఎంపీ పుట్టా మహేష్ కుమార్. సోమవరప్పాడు గ్రామం వద్ద రోడ్డుపై పడిపోయి కనిపించిన ద్విచక్ర వాహనదారుని చూసి వాహనాన్ని ఆపారు. అతని వద్దకు వెళ్లి, అప్పటికే అక్కడ గుమిగూడిన వారిని అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. ముందుగా రోడ్డు ప్రమాదం గా భావించినా, అక్కడ రక్తపు మరకలేవీ కనిపించలేదు. కానీ అంబులెన్స్ వచ్చే వరకూ ఆగితే ఆ వ్యక్తి ప్రాణానికే ప్రమాదం అని భావించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఫిట్స్ తో గిలగిలా కొట్టుకుంటున్న ఆ వ్యక్తిని తన వాహనంలో ఎక్కించి, తన సిబ్బందిని తోడుగా ఇచ్చి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఆసుపత్రికి ఫోన్ చేసి సమాచారం అందించి, వేగంగా మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఎంపీ నుంచి వచ్చిన ఫోన్ కాల్ తో అలెర్ట్ అయిన వైద్య సిబ్బంది, ఎంపీ వాహనం ఆసుపత్రికి చేరగానే బాధితుడిని లోపలికి తీసుకుని వెళ్ళి పరీక్షలు చేయగా, అప్పటికే ఆ వ్యక్తి మరణించినట్లు తేలింది. ఫిట్స్ తోపాటు గుండెపోటు రావడంతో మార్గమధ్యలోనే చనిపోయినట్లు డాక్టర్లు ప్రకటించారు. చనిపోయిన వ్యక్తితో పాటు ఉన్న రెండవ వ్యక్తి నుంచి సేకరించిన సమాచారం ప్రకారం చనిపోయిన వ్యక్తి పేరు గంటా సుబ్బారావు, ఏలూరు శివారు, పతేబాద గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది. వయసు సుమారు 60 సం. ఉంటుందని చెబుతున్నారు. ఏదేమైనా పక్కనే ఒక మనిషి చనిపోతున్నా పట్టించుకొనే నేటి రోజుల్లో, రాత్రి సమయంలో రోడ్డుపై పడి ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించిన ఏలూరు ఎంపీ చొరవకు, మానవతా దృష్టికి ప్రశంసలు అందుతున్నాయి.



# గణనాధుని సేవలో ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి



**కాణిపాకం, స్వర్ణ సాగరం మే 14**

కాణిపాక స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వెంకట జ్యోతిర్మయి.కాణిపాకం శ్రీ వరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటజ్యోతిర్మయి , కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు చిత్రపటాన్ని అందజేసిన దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ , ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, చిత్తూరు కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ జాతర విజయవంతంపై ఎమ్మెల్యే విజయశ్రీ కి కృతజ్ఞతలు.

### శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్,మరియు సభ్యులు.



**స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 14.**

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని ఈ నెల మే 5,6వ తారీకుల్లో జరిగిన నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర మహోత్సవాన్ని విజయవంతం చేసిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కి పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావుతోపాటు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.గురువారం వారు సూళ్లూరుపేట పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి దంపతులను శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,కమిటీ సభ్యులు నిత్యా కృష్ణారెడ్డి,వినుకొండ ధనంజయ, ఆబోతుల బాబు,బాలుశెట్టి, ఆలయ పూజారి సురేష్,టిడిపి నాయకులు ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు,వాకిరి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యే దంపతులకు శాలువాలు కప్పి,తాంబూలం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

# కక్ష సాధింపు రాజకీయాలు మంచిది కాదు:



### మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి....

**పెళ్లకూరు స్వర్ణసాగరం మే 14.**

చంద్రబాబు ప్రభుత్వంలో కక్ష సాధింపు రాజకీయాలు కొనసాగించడం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురి చేయడం మంచి పద్ధతి కాదు అని మాజీ మంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి వెల్లడించారు. నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డిసిసిబి మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని గురువారం మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి , సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్యలు కలిసి పరామర్శించారు. జైలులో ఉన్న సత్యనారాయణ రెడ్డి ఆరోగ్య పరిస్థితి, జైలు పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ టీడీపీ పాలనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు రాజకీయాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. రాజకీయ ప్రతీకార ధోరణితోనే అక్రమ కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ వేధింపులు అధికమయ్యాయి అన్నారు. వైఎస్సార్సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలకు ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తోటపల్లి గూడూరులో జోరుగా జనగణన



### సందర్శించిన జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్

**తోటపల్లి గూడూరు స్వర్ణ సాగరం మే 14**

జనగణన 2027 లో భాగంగా ఇండ్ల గణన జరుగుతున్న విషయం తెలిసిందే. నేడు మండలంలోని పలు గ్రామాలలో ఇండ్ల గణన జరుగుతున్న విధానాన్ని జిల్లా కలెక్టరు ఆదేశములతో జిల్లా సెన్సస్ టాస్క్ ఫోర్స్ టీమ్ ఆకస్మికంగా వచ్చి పర్యవేక్షించింది. క్షేత్ర స్థాయిలో ఇండ్లగణన జరుగుతున్న సమయంలో వరిగొండ, రావూరు వారి కండ్రిగ లలోని సెన్సస్ బ్లాక్ లను ఆకస్మికంగా సందర్శించి గణన జరుగుతున్న విధానాన్ని వారు పరిశీలించారు. జిల్లా టీమ్ లో శ్రీ రాజమోహన్ రెడ్డి , లక్ష్మి కుమారి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లు రెడ్డి ప్రసన్న, రంగమ్మ, ఎన్యుమరేటర్లు విద్యాసాగర్, సుమలత, ధృవ కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.తదుపరి జరిగిన సమావేశంలో మండలంలో మొత్తం 90 మంది సచివాలయ సిబ్బంది గణకులుగా, 15 మంది మండల స్థాయి అధికారులు పర్యవేక్షకులుగా తొలిదశ జనగణన అయిన ఇండ్లగణనలో పాల్గొంటున్నారని నేటివరకు సుమారుగా 40 శాతం గణన పూర్తి అయినట్లు మండల గణాంకాధికారి రాంప్రసాద్ వారికి వివరించారు.

# వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత..

### వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి



**నెల్లూరు స్వర్ణ సాగరం మే 14**

. వృద్ధులను ఆదరించి సహాయం చేయటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. ప్రశాంత్ మెమోరియల్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో జనహిత వాత్సల్య వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ ఇళ్లల్లో జరిగే కార్యక్రమాలను వృద్ధాశ్రమంలో నిర్వహించుకోవాలని కోరారు. వసుదైక కుటుంబం నుంచి సమాజ ము ఒంటరి కుటుంబానికి మారిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన సోదరుడు ప్రశాంత్ మృతి చెంది 20 సంవత్సరాల అయిందని అతని జ్ఞాపకంగా తాను సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వాత్సల్య ఏర్పడి 30 సంవత్సరాలు జరిగిందని ప్రారంభం ఉండి నేటి వరకు నిరాశ్రయులైన బాల బాలికలను వృద్ధులను సంస్థ ఆదరిస్తుందని ఆమె అభినందించారు. ఈ సందర్భంగా వృద్ధులకు భోజనం. పండ్లు.బ్రెడ్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య జాయింట్ సెక్రెటరీ దుర్గాప్రసాద్..నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్. గిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ రచయిత్రి డా.పెళ్ళకూరు జయప్రదకు నెరసం ఘన సత్కారం



**నెల్లూరు స్వర్ణ సాగరం మే 14**

, ప్రముఖ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద గారు హైదరాబాద్ లో మదర్స్ డే సందర్భంగా అమృత లత అపురూప జీవిత సాఫల్య అవార్డును అందుకున్న సందర్భంగా నెల్లూరు జిల్లా రచయితల సంఘం వారిని ఘనంగా సన్మానించారు. వారు చేసిన సాహిత్య, సామాజిక సేవలను అభినందించారు. ఈ సందర్భంగా జయప్రద రాసిన నవలలపై కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ మాట్లాడారు. నెల్లూరు జిల్లాలో తొలి నవలా రచయిత్రి అని అభినందించారు.ఈ కార్యక్రమం లో నెరసం అధ్యక్ష కార్యదర్శులు ఎ.జయప్రకాష్, డా. పాతూరి అన్నపూర్ణ కార్యవర్గ సభ్యులు సందడి అరుణ, సయ్యద్ నజ్మా బేగం, విజయ భారతి , ఇనమన మెళ్లూరు నాగరాజా రావు పాల్గొన్నారు.

# జువ్వల కుటుంబంలో ఆణిముత్యం

## ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో జువ్వల జస్విత్ రెడ్డి ఘన విజయం

రేణిగుంట స్వర్ణ సాగరం మే 14

కష్టపడే తత్వం, లక్ష్యసాధనపై అచంచల నమ్మకం, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉంటే విద్యార్థులు ఎంతటి విజయాలనైనా సొంతం చేసుకోవచ్చని మరోసారి నిరూపించాడు జువ్వల జస్విత్ రెడ్డి. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (ఏ.పి.ఆర్.జె.సి) ప్రవేశ పరీక్ష--2026లో అద్భుత ప్రతిభ కనబరిచి ఈఈటీ గ్రూప్‌లో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించి గర్వకారణంగా నిలిచాడు. రేణిగుంట మండలం గాజులమండ్యం గ్రామానికి చెందిన జువ్వల దయాకర్ రెడ్డి కుమారుడైన జస్విత్ రెడ్డి చిన్నప్పటి నుంచే చదువుపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తూ ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందాడు. తరగతి గదిలోనే కాకుండా పోటీ పరీక్షల్లో కూడా రాణించాలని లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ ఈ విజయాన్ని అందుకున్నాడు. ఏ.పీ.ఆర్.జె.సి ప్రవేశ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పోటీతో కూడుకున్న పరీక్షగా గుర్తింపు పొందింది. ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుంటారు. అలాంటి పోటీ వాతావరణంలో రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ సాధించడం సాధారణ విషయం కాదని ఉపాధ్యాయులు పేర్కొం టున్నారు. ముఖ్యంగా ఈఈటీ గ్రూప్‌లో జస్విత్ సాధించిన ర్యాంక్ కుటుంబ సభ్యులు, బంధువులు, ఉపాధ్యాయులు, స్నేహితుల్లో ఆనందోత్సాహాలు నింపింది. అతని విజయాన్ని తెలుసుకున్న స్థానికులు అభినందనలతో ముంచెత్తుతున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ జస్విత్ చిన్నప్పటి నుంచే చదువుపై ఎంతో శ్రద్ధ చూపేవాడన్నారు. సమయ పాలన, క్రమశిక్షణతో చదువుకుంటూ ఎప్పుడూ మంచి ఫలితాలు సాధించేవాడు అని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించడం కుటుంబానికి ఎంతో గర్వకారణం అని ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ జస్విత్ చాలా మృదుస్వభావి, క్రమశిక్షణ కలిగిన విద్యార్థి. తరగతిలో ఎప్పుడూ చురుకుగా పాల్గొంటూ ప్రతి అంశాన్ని అర్థం చేసుకునేందుకు ఆసక్తి చూపేవాడు. అతని పట్టుదలే ఈ విజయానికి ప్రధాన కారణం అని ప్రశంసించారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల సహకారం కూడా ముఖ్య కారణమని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన దిశలో కష్టపడితే రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటగలరని జస్విత్ విజయం మరోసారి నిరూపించిందన్నారు. స్థానికులు మాట్లాడుతూ ఇలాంటి విద్యార్థులు రేణిగుంట ప్రాంతానికి మంచి పేరు తీసుకువస్తున్నారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకొని సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. జస్విత్ రెడ్డి మాట్లాడుతూ ఈ విజయానికి కారణమైన





Government of Andhra Pradesh
Department of School Education
APREI Society, Amaravati at Mangalagiri
APRJC INTER RESULT - 2026-27

JUVVALA JASWITH REDDY
Candidate ID : 2611049015
Hallticket No : 2652110006
Rank Results

| | | | |
|---|---|---|---|
| Gender | Male | Date of Birth | 22/05/2011 |
| Father's Name | J DAYAKAR REDDY | Caste | OC |
| If Differently Abled(PH) | No | Is CAP Candidate | No |
| Is Sports Candidate | No | Is Orphan Candidate | No |
| Group | EET | Rank | 33 |
| Total Marks | 150 | Obtained Marks | 77 |

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇంకా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఉందని వినయంగా స్పందించాడు. అతని విజయం తెలుసుకున్న స్నేహితులు, బంధువులు, స్థానికులు ఇంటికి చేరుకుని అభినందనలు తెలిపారు. మిఠాయిలు పంచుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. పట్టుదల ఉంటే అసాధ్యం అనేది ఉండదు అనే మాటకు జస్విత్ రెడ్డి నిలువెత్తు ఉదాహరణగా నిలిచాడని పలువురు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరింత ఉన్నత విజయాలు సాధించి కుటుంబానికి, రేణిగుంట ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని అందరూ ఆశీర్వదిస్తున్నారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తితో మొదలైన వాహనాల రాకపోకలు







రేణిగుంట స్వర్ణ సాగరం మే 14

రేణిగుంట లోని రైల్వే అండర్ బ్రిడ్జ్ మరమ్మత్తు పనులు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం రైల్వే అండర్ బ్రిడ్జి మీదుగా వాహనాల రాకపోకలను రేణిగుంట తాసిల్దార్ శ్యామ్ ప్రసాద్, ఎంపీడీవో రవిచంద్ర, రైల్వే అధికారులు, పట్టణ సిఐ జయచంద్ర రోడ్డు మార్గాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవిచంద్ర మాట్లాడుతూ సకాలంలో రైల్వే అండర్ బ్రిడ్జిని పూర్తి చేసినందుకు రైల్వే అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అండర్ బ్రిడ్జ్ అనుకున్న విధంగా సకాలంలో పూర్తి చేసినందుకు అధికారులను స్థానిక టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మునిచంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇంచార్జ్ పుష్ప నాదన్ తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి కార్యకర్తలు



స్వర్ణ సాగరం రామకుప్పం మే 14

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లి పంచాయతీ లింగాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి కుప్పంనియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ,కడ చైర్మన్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కృషి చేసి ఎన్డీఏ అభ్యర్థుల విజయానికి పాటుపడాలని వారిని కోరడం జరిగింది....ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ శాంతారామ్ , రామకుప్పం మండల పార్టీ అధ్యక్షులు వెంకటరమణ ,మాజీ మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, ఎంపీపీ గురప్ప ,ప్రధాన కార్యదర్శులు, మాజీ కార్యదర్శులు, కామరాజ్ నాయుక్ మరియు నరసింహాలు ,రాష్ట్ర డైరెక్టర్స్ మునస్వామి ,మాజీ అధ్యక్షులు ఆంజనేయరెడ్డి ,మనోహర్ రెస్కో డైరెక్టర్,కాడ డైరెక్టర్ రఘు , మాజీ సర్పంచ్ జయశంకర్ , మాజీ వైస్ ఎంపీపీ చినికృష్ణ , చలపతి, ఏఎంసి డైరెక్టర్స్ ,మరియు క్లస్టర్ -కో ఇంఛార్జీలు నాగభూషణం, చలం మరియు యూనిట్ ఇంఛార్జీలు రామామూర్తి అన్న,కృష్ణప్ప,జెయి అన్న ,తెలుగుయువత్ అధ్యక్షులు బాలకృష్ణ ,మహిళా అధ్యక్షులు గీతమ్మ మైనార్టీ అధ్యక్షులు ఆదిల్ , పార్టీ అధ్యక్షులు మనీష్ , మహేందర్ నాయుడు, సుభాష్ ,కృష్ణారెడ్డి,మరియు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# తడ జాతీయ రహదారిపై బస్సు బోల్తా

## బస్సు ప్రమాద సమయంలో 30 మంది కార్మికులు

## త్రుటిలో తప్పిన పెను ప్రమాదం ! టీవీఎస్ పరిశ్రమకు చెందిన బస్సుగా గుర్తింపు





స్వర్ణ సాగరం,సూళ్లూరుపేట/తడ మే 14 :

తడ మండలం బోడిలింగాలపాడు శివాలయం సమీపంలో సూళ్లూరుపేట నుండి చెన్నై వైపుగా వెళ్లే ఎన్ హెచ్-16 రోడ్డుపై అడ్డంగా బస్సు బోల్తా పాడింది.బస్సు బోల్తా పడిన ప్రాంగణంలో ఆర్తనాధాలతో హెరెత్తింది.స్థానికులు తెలిపిన వివరాల మేరకు గురువారం మధ్యాహ్నం దొరవారిసత్రం నుంచి శ్రీ సిటీ పరిశ్రమిక వాడలోని టీవీఎస్ ఆటోమొబైల్స్ పరిశ్రమకు బి షిఫ్ట్ కు 30 మంది కార్మికులను తరలించే సమయంలో తడ బోడిలింగాలపాడు శివాలయం ఆలయ సమీపంలో హఠాత్తుగా బస్సు అదుపుతప్పి బోల్తా పడింది.ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రాణా నష్టం సంభవించలేదు,ఐదు మందికి స్వల్ప గాయాలయ్యాయి.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను తడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.ప్రమాదపై ప్రాథమికంగా పోలీసులు తెలిపిన వివరాలు బస్సు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై అడ్డంగా బోల్తా పడిందని ఈ ఘటనలో స్వల్ప గాయాలతో బయటపడ్డారని ఎవరికి ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరిపించుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపిన తడ పోలీసులు. ప్రమాదంతో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించింది.వాహనాలు రాకపోకలకు అంతరాయం కలగకుండా స్థానికులు పోలీసులు తక్షణం సహాయక చర్యలు చేపట్టినట్లు తడ పోలీసులు తెలిపారు.

# ఇసుక దోపిడీతో రూపు కోల్పోయిన స్వర్ణముఖినది

## కూటమి నాయకులతో కలిసి కాంట్రాక్టర్ ఇసుక దోపిడి...

## జగనన్న అధికారంలోకి వస్తే రికవరీ చేసేలా చర్యలు....

## వైయస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మధుసూదన్ రెడ్డి వెల్లడి..

పెళ్లకూరు స్వర్ణసాగరం మే 14.

కూటమి పాలనలో నిబంధనలను పట్టించుకోకుండా యదేచ్ఛగా యంత్రాలతో ఇసుక దోపిడీ చేయడం వల్ల స్వర్ణముఖినది రూపు కోల్పోయిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి చిందేపల్లి మధుసూదన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కలవకూరు గ్రామం వద్ద స్వర్ణముఖి నది డీసెల్టింగ్ పాయింట్ ను ఆయన పర్యవేక్షించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నదిలో ఉన్న ఇసుక పైపొరను కేవలం మూడు అడుగులు మాత్రమే రోజువారి కూలీలతో తవ్వకాలు చేపట్టి స్థానిక అవసరాల నిమిత్తం తీసుకుని వాడుకోవాల్సి ఉంది. అయితే ఇక్కడ కాంట్రాక్టర్ కూటమి నాయకులతో చేతులు కలిపి నిబంధనలను తుంగలో తొక్కి భారీ







యంత్రాలతో ఇసుక త్రవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లు లారీలతో పట్టణ ప్రాంతాలకు తరలించి కోట్ల రూపాయలు జేబులు నింపుకున్నట్లు ఆరోపించారు. భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాల వల్ల చెరువుల కంటే మిన్నగా లోతైన గోతులు ఏర్పడి ప్రమాదకర స్థితిలో స్వర్ణముఖినది రూపు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి నది పరివాహక గ్రామాలైన కలవకూరు, పుల్లూరు, చింతపూడి, అనకవోలు తదితర గ్రామాలకు తాగు సాగునీటికి ఇబ్బందులు నెలకొన్నట్లు పేర్కొన్నారు. గత కొంత కాలంగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నప్పటికీ ఇక్కడ వివిధ శాఖల ఉన్నతాధికారులు కాంట్రాక్టర్ అందించే ముడుపులకు అలవాటు పడి కనీసం కంటి తుడుపు చర్యలు కూడా చేపట్టలేదని ఆరోపించారు. స్వర్ణముఖినది ఇసుక దోపిడీపై ప్రశ్నించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై అక్రమ కేసులు నమోదు చేసి జైలులో పెట్టి భయభ్రాంతులకు గురి చేయడం కూటమి సర్కారుకు తగదన్నారు. రాజకీయ కక్ష సాధింపు ధోరణతోనే పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని జైలులో నిర్బంధించి బెయిల్ రాకుండా అడ్డుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్న కూటమి నేతలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. అయితే కూటమి నాయకులతో కలిసి కాంట్రాక్టర్ చేస్తున్న ఇసుక దోపిడీపై 2029లో జగనన్న ప్రభుత్వం వచ్చిన వెంటనే దోచుకున్న ఇసుక సొమ్మును పూర్తిస్థాయిలో రికవరీ చేసేలా గట్టి చర్యలు చేపడతామని హెచ్చరించారు. కూటమి నాయకులంతా ప్రకృతి సంపదను దోచుకోవడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇంతటి దారుణం మరెక్కడా లేదన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

# రావూరి వారి కండ్రిగలో బడి పిలుస్తుంది





తోటపల్లి గూడూరు స్వర్ణసాగరం మే 14

మండలంలోని వరిగొండ పంచాయతీరావూరు వారి కండ్రిగ పాఠశాల నందు గురువారం బడి పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న MEO 2 జయరామా నాయుడు , వరిగొండ కాంప్లెక్స్ HM సురేంద్ర, పాఠశాల టీచర్లు విద్యుల్లత ,సునీత ,కౌసల్య, కామాక్షమ్మ,CRP మల్లిఖార్జున్, IERT లావణ్య, అంగన్వాడీ సిబ్బంది, SMC సభ్యులు,తల్లిదండ్రులు మరియు విద్యార్థుల ంపాల్గొనడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్చడం వల్ల కలిగే లాభాలను గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం జరిగింది.ముగ్గురు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది.

# దాన్యం,మక్కల కొనుగోళ్ళను వేగవంతం చేయాలి

## మన్నెగూడెం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేసిన మాజీ మంత్రి రెడ్యానాయక్

స్వర్ణసాగరం డోర్నకల్ మే 14

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మాజీ మంత్రి రెడ్యానాయక్, రైతులతో కలిసి గురువారం మహబూబాబాద్ జిల్లా సిరోలు మండలం మన్నెగూడం గ్రామ ప్రధాన రహదారిపై భారీ ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండుటెండను లెక్క చేయకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ముందుగా పి.ఎ.సి.ఎస్ ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడున్న సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి రెడ్యానాయక్ మాట్లాడుతూ అకాల వర్షాలతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు ఎప్పుడు తడిసిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తక్షణమే మక్కల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కల్లాల్లో కాం టాలు వేసిన బస్తాలను లారీల ద్వారా తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సీతారాం రెడ్డి ,జయపాల్ రెడ్డి,బిక్షం రెడ్డి, కత్తెరసాల విద్యాసాగర్,సర్పంచ్ రాయల వెంకటేశ్వరరావు,కడెం బాబు , అయూబ్, కాడం ప్రశాంత్,మధు,మోహన్ భోజు నాయక్, అప్పారావు ,మోహన్ రావు, బోసు వెంకన్న,లచ్చు నాయక్, నందూరు బాబు, కాసం వెంకన్న, తాళ్లూరి సతీష్, నిరుడి రాజశేఖర్,రేపాకుల కృష్ణ,ఆంజనేయులు,సామినేని సతీష్,రమేష్, వీరన్న,హైమావతి, రంజిత్,చిర్ర వెంకన్న చిర వీరభద్రం, బాబు రామ్ కోటి, కొర్ని సంతోష్,వెంకటేష్, భాస్కర్, నవీన్ తదితరులు ఉన్నారు



# కాలువలో యువకుడి మృతి.. ప్రమాదమా? అనుమానాస్పదమా?

స్నేహితుడితో గొడవ తర్వాత అదృశ్యం,
తెలుగు గంగ కాలువలో మృతదేహం లభ్యం,

స్వర్ణసాగరం– తొట్టంబేడు,





తొట్టంబేడు మండలంలోని గుమ్మడిగుంట ఎస్టీ కాలనీ సమీపంలో ఉన్న తెలుగు గంగ కాలువ సబ్ కెనాల్‌లో యువకుడు మృతిచెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. తొలుత అనుమానాస్పద మృతిగా భావించిన ఈ ఘటనలో, ప్రాథమిక దర్యాప్తులో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు.పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం కాగితాల హరిజనవాడకు చెందిన పల్లిపాటి శశి అలియాస్ శశికుమార్ (20) పలమనేరు వద్ద సెప్టిక్ ట్యాంక్ వెహికల్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10న తన అక్క చెంగమ్మ ఇంటికి వచ్చిన అతడు, జీతం డబ్బులు తీసుకునేందుకు నాయుడుపేటకు వెళ్తున్నానని చెప్పి బయలుదేరాడు.11వ తేదీ సాయంత్రం నాయుడుపేట నుంచి ఏపీ 39 టీవీ 9187 నంబర్ గల పల్సర్ బైక్‌పై లోతువానిగుంటలో నివసిస్తున్న తన చెల్లెలు పవిత్ర ఇంటికి వెళ్లాడు. అక్కడ కొద్దిసేపు గడిపిన అనంతరం తిరిగి శ్రీకాళహస్తికి బయలుదేరినట్లు కుటుంబ సభ్యులకు తెలిపాడు. రాత్రి 8.45 గంటల తర్వాత నుంచి అతని మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు.ఈ క్రమంలో 13వ తేదీన గుమ్మడిగుంట సమీపంలోని తెలుగు గంగ కాలువ సబ్ కెనాల్‌లో ఓ యువకుడి మృతదేహం లభ్యమైనట్లు తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఫోటోలు, వీడియోల ఆధారంగా మృతుడు శశికుమార్‌గా గుర్తించారు.దర్యాప్తులో భాగంగా శశికుమార్ తన స్నేహితుడు శివతో కలిసి మద్యం సేవించినట్లు, వారిద్దరి మధ్య చిన్నపాటి గొడవ జరిగినట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే కేసు నమోదు అనంతరం పోలీసులు గాలింపు చేపట్టగా, రాత్రి సుమారు 11.30 గంటలకు తెలుగు గంగ కాలువ కట్టపై పెద్దకన్నులు సమీపంలో బైక్ పడిపోయి కనిపించింది.ప్రాథమిక దర్యాప్తు ప్రకారం మద్యం సేవించిన స్థితిలో బైక్ అదుపుతప్పి కాలువలో పడిపోవడంతో శశికుమార్ నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# విద్యుత్ ఘాతకానికి ఇల్లు దగ్ధం



నాగలాపురం –స్వర్ణ సాగరం,మే 13:

నాగలాపురం పట్టణంలోని పడమర హరిజనవాడలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు పైన వేలు,శ్రీవల్లి గృహములో విద్యుత్ సర్కులేట్ అయి ఇల్లు మొత్తం విద్యుత్ ఘాతకానికి గురైంది.ఈ సంఘటనలో వేలు శ్రీవల్లి కూలి పనికి వెళ్లడంతో 12 సంవత్సరాల బాలుడు ఇంట్లో నిద్రపోతున్న సమయంలో విద్యుత్ సర్కులేట్ ఒక్కసారిగా మంటలు గృహము నుండి బయటకు రావడంతో చుట్టుపక్కల ఉన్న వ్యక్తులు వెంటనే ఇంటి లోపల ఉన్న బాలుడిని బయటికి తీసుకుని రావడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు.కానీ ఆస్తి మాత్రం భారీ నష్టం జరిగింది.కూలి పని చేసుకునే జీవనం గడిపే వేలు శ్రీవల్లి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పంచాయతీ అభివృద్ధి అధికారులకు క్షేత్రస్థాయి అవగాహన శిక్షణ,

పెద్ద కన్నలి గ్రామపంచాయతీలో
రాయలసీమ జిల్లాల అధికారుల పర్యటన,
త్రాగునీరు, పారిశుధ్యం, రిజిస్టర్ల
నిర్వహణపై ప్రాక్టికల్ అవగాహన,

స్వర్ణసాగరం– తొట్టంబేడు,



ఏడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రాయలసీమ జిల్లాలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులు పెద్ద కన్నలి గ్రామపంచాయతీని క్షేత్రస్థాయి అవగాహన నిమిత్తం సందర్శించారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న అధికారులకు గ్రామపంచాయతీ స్థాయిలో అమలు చేస్తున్న త్రాగునీటి, పారిశుధ్య నిర్వహణ విధానాలు మరియు వివిధ రకాల రిజిస్టర్ల నిర్వహణపై ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సేఫ్ డ్రింకింగ్ వాటర్‌ను ప్రజలకు ఏ విధంగా అందించాలి, ఇన్‌లైన్ క్లోరినేషన్ వల్ల కలిగే ప్రయోజనాలు, గ్రే వాటర్––బ్లాక్ వాటర్ వేరు చేసే విధానం, ఎస్‌డబ్ల్యూపీసీ ద్వారా చెత్తను శాస్త్రీయబద్ధంగా సేకరించి నిర్వహించే పద్ధతులపై వివరించారు. అలాగే గ్రామపంచాయతీ స్థాయిలో నిర్వహించాల్సిన వివిధ రకాల రిజిస్టర్ల నిర్వహణ విధానాలను అధికారులకు వివరి చారు. స్వర్ణాంధ్ర––2047 లక్ష్యాల సాధనలో భాగంగా ప్రజలకు రక్షిత మంచినీరు, ఆరోగ్య కరమైన వాతావరణం, ప్రజల వద్దకే పాలన అందించే విధా నాలపై మంచి పద్ధతులను అవలంబించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు.ఈ కార్యక్రమం తొట్టంబేడు మం డల అభివృద్ధి అధికారి సురేంద్ర ఆధ్వర్యంలో, పెద్ద కన్నలి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ సమన్వయంతో నిర్వహి ంచబడింది. శిక్షణ నిపుణులు సురేష్, మధుసూదన్, జేకే రెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాలకు చెందిన పంచాయతీ అభివృద్ధి అధికారులకు ఒకరోజు క్షేత్రస్థాయి శిక్షణ అందించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన అధికారులందరికీ విస్తన్న శిక్షణ కేంద్ర ప్రిన్సిపాల్ విద్యా రమా ధన్యవాదాలు తెలిపారు.

# మన దేశం, మన బాధ్యత, మన భవిష్యత్తు

– ఏఎం సి డైరెక్టర్ బోలా శీను

మనుబోలు, స్వర్ణసాగరం:



ప్రపంచ సంక్షోభ సమయాన మన దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవడం మనందరి బాధ్యత ప్రపంచంలో యుద్ధాలు, మాంద్యం, సప్లై చైన్ సమస్యలు వచ్చినప్పుడు భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై ప్రభావం పడుతుంది అని ఏఎంసి డైరెక్టర్ బోలా శ్రీను అన్నారు. కాగితాలపూర్ లోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనం ప్రతి ఒక్కరం దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలిఒక సంవత్సర కాలం బంగారం కొనుగోలు చెయ్యవద్దు.పెట్రోల్,డీజిల్ అధిక వాడకలు తగ్గిందాం.మనం ఏం చేయగలం 5 పాయింట్లు స్వదేశీ వస్తువులు కొనడం, మన చిన్న వ్యాపారులను ప్రోత్సహించడం. భారత్‌లో తయారైన ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం డిజిటల్ పేమెంట్స్ రూపే కార్డ్ వాడకం పెంచడం, నగదు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం. పొదుపు ఒ పెట్టుబడి దేశంలోనే పెట్టుబడులు పెట్టడం, స్టార్టప్‌లను ప్రోత్సహించడం. పన్నులు సక్రమంగా నిజాయితీగా పన్నులు చెల్లించడం, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావడం.ప్రపంచ సంక్షోభ సమయాన భారత్ బలం మన ఐక్యత యుద్ధాలు, మాంద్యాలు వచ్చినాభారత ఆర్థిక వ్యవస్థ చెక్కుచెదరదు.కారణం 140 కోట్ల మంది మన సంకల్పం!స్వదేశీ వాడుదాం స్వావలంబన సాధిద్దాం..మోదీజీ విజన్ 'ఆత్మనిర్భర్ భారత్'ను గెలిపిద్దాం!మన దేశం మన బాధ్యత మన భవిష్యత్తు జైహింద్ జై భారత్ అని ప్రతి ఒక్కరూ పిలుపు నివ్వాలని ఆయన కోరారు.

# వైకాపా నేత సత్యనారాయణ రెడ్డిని పరామర్శించిన కాకాణి,కిలివేటి.



స్వర్ణ సాగరం (నాయుడుపేట) మే 14.

నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డిని గురువారం వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, సులూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం సెంట్రల్ జైల్లో పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి,జైలు పరిస్థితుల గురించి సత్యనారాయణ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ పాలనలో వైసీపీ నాయకులు,కార్యకర్తలపై కక్షసాధింపు రాజకీయాలు కొనసాగుతున్నాయని విమర్శించారు.రాజకీయ ప్రతీకార ధోరణితోనే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు.మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ వేధింపుల పాలన కొనసాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు.ఇలాంటి చర్యలకు ప్రజలే తగిన సమయంలో సమాధానం చెబుతారని పేర్కొన్నారు.

# కౌలు పొలం వద్ద బావిలో పడి రైతు మృతి,

బురదలో కూరుకుపోయిన మునుస్వామి మృతదేహం వెలికితీత,
కురవ కన్నేరి గ్రామంలో విషాద ఘటన,

స్వర్ణసాగరం– తొట్టంబేడు,



లింగమనాయుడు పల్లి పంచాయతీ పరిధిలోని కురవ కన్నేరి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మునుస్వామి (37), తండ్రి నడిపయ్య, ప్రమాదవశాత్తు తాను కౌలుకు చేసుకుంటున్న పొలం వద్ద ఉన్న బావిలో పడి మృతి చెందాడు.కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, మునుస్వామి ఉదయం సుమారు 11 గంటల నుంచి కనిపించకపోవడంతో అతని తల్లి చుట్టుపక్కల వెతికింది. అనంతరం పొలం వద్ద ఉన్న బావిలో పరిశీలించగా, లుంగి పైకి కనిపించింది. దీంతో గ్రామస్తుల సహాయంతో బావిలో నుంచి బయటకు తీయగా, అప్పటికే మునుస్వామి మృతి చెందినట్లు గుర్తించారు.బావిలో బురద ఎక్కువగా ఉండటంతో అతను అందులో కూరుకుపోయి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఘటనపై ఇంకా అధికారిక ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, శుక్రవారం ఉదయం శవ పంచనామా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# రైల్వే అధికారులకు, కాంట్రాక్టర్లకు సూరి రాయల్ అభినందనలు

రేణిగుంట స్వర్ణ సాగరం మే 14



రేణిగుంటలో అత్యంత కీలకమైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులను కేవలం నెల రోజుల్లోనే పూర్తి చేసిన రైల్వే అధికారులు, కాంట్రాక్టర్లను రేణిగుంట మండల ఉపాధ్యక్షులు సూరి రాయల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 13న ప్రారంభమైన ఈ పనులు మే 13 నాటికి పూర్తి కావడం వెనుక అధికారుల పట్టుదల, కాంట్రాక్టర్ల కృషి ఎంతో ఉందన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు, ప్రజల ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేశారని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేసినందుకు రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి, స్థానిక అధికారులకు సూరి రాయల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ అండర్ బ్రిడ్జి ద్వారా రేణిగుంట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించిందని, వాహనదారులకు ప్రయాణం సులభతరం అయిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

# తలమంచి అభివృద్ధికి అడుగులు..

రూ. 90 లక్షల పనులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి శ్రీకారం

కోవూరు, స్వర్ణ సాగరం , మే 14:



ప్రజా సేవయే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, తలమంచి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కొడవలూరు మండలం తలమంచి గ్రామంలో సుమారు రూ. 90 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.?ఈ సందర్భంగా రూ. 25 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే, రూ. 30 లక్షలతో మంజూరైన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి నిధులు రూ. 20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు, నుడా నిధులు రూ. 15 లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు.

**ఉపాధికి పెద్దపీట.. సెజ్ ద్వారా పెట్టుబడులు**

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 23 నెలల్లోనే తలమంచిలో రూ. కోటి 15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌కు రూ. 10 వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని, తద్వారా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. యువతలో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణా కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

"మా కుటుంబం రాజకీయాల్లోకి వచ్చింది ప్రజా సేవ కోసమే. కోవూరు నియోజకవర్గానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి రూ. 9 కోట్లు మంజూరు చేశారు" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. తలమంచిలో హెల్త్ సెంటర్ ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం చేరువవుతుందన్నారు.

మహానాడును విజయవంతం చేయాలి

త్వరలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'మహానాడు'ను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను నాయకులు భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, యువనేత పిట్టు కార్తీక్ యాదవ్, కూటమి నాయకులు మరియు అధికారులు పాల్గొన్నారు.

# సాయిబాబాకు పూజలు

ఉభయకర్తలుగా ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు,
సాయి వెంకటేష్ రెడ్డి, జీవనా రెడ్డి దంపతులు

స్వర్ణ సాగరం ఓజిలి మే 14:



మానమాల సాయిబాబా మందిరంలో మందిర నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు సాయిబాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడాహారతి సాయినాథుని మేల్కొల్పి కాగడాహారతితో పూజలను ప్రారంభించారు. ఆలయ శాశ్వతనిర్మాణ కర్తలు కట్టా విష్ణువర్ధన్ రెడ్డి, సాయి సుజన రెడ్డి గోత్ర నామాలపై పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సాయిబాబాకు అభిషేకాలు, హారతులు పట్టి వినాయకస్వామి, దత్తాత్రేయ స్వామి, శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయినాథుని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామానికి చెందిన ఆలయ నిర్మాణ కర్తలు ఉచ్చూరు హరనాథ్ రెడ్డి, శోభారాణి దంపతులు, ఉచ్చూరు సాయి వెంకటేష్ రెడ్డి, జీవనా రెడ్డి దంపతులు ఉభయకర్తలగా వ్యవహరించి నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. సాయంత్రం దూఫ్ హారతితో సాయినాథుని కి పూజలు చేశారు. రాత్రి పల్లకి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. సేజ్ హారతి నిర్వహించి భక్తులకు సాయిబాబా దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

# చికూరుపల్లి గ్రామంలో ఆఖరి ఘట్టం దుర్యోధన వద కార్యక్రమంలో పాల్గొన్న ధరణి ప్రసాద్

బంగారుపాళ్యం.స్వర్ణసాగరం. మే 14





బంగారుపాలెం మండల పరిధిలోని చీకూరుపల్లి గ్రామంలో గత నెల 24వ తేదీ నుంచి జరుగుతున్న మహాభారత యజ్ఞంలో చివరి రోజు గురువారం దుర్యోధన వద కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బంగారుపాలెం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ధరణి ప్రసాద్, రాళ్లపల్లి మోహన్ నాయుడు, మండల పార్టీ కార్యదర్శి జనార్ధన్ గౌడ్, హేమచంద్ర నాయుడు,రాధాకృష్ణ, సుబ్రహ్మణ్యం నాయుడు లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు వీరికి గ్రామస్తులు శాలువ కప్పి ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందించారు మహాభారత యజ్ఞం చివరి రోజు కావడంతో చికూరుపల్లి,కేజీ సత్రం,సి ఆర్ కాలనీ,లక్ష్మీ నగర్ కాలనీ,పామనివాండ్ల ఊరు,కల్లూరుపల్లి,కాటప్ప గారిపల్లి మరియు మండలంలోని ప్రజలు ఈ దుర్యోధన కార్యక్రమంలో పాల్గొన్నారు

# కష్టపడి చదివితే విజయం మీదే

స్వర్ణ సాగరం బుచ్చినాయుడు కండ్రిగ



మండల కేంద్రంలోని పల్లమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తీర్ణత కానీ విద్యార్థిని విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ఓన్నీ సుబ్రహ్మణ్యం పాఠశా లను తనిఖీ చేపట్టా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయికి వెళ్తా రని. విద్యార్థులు రాబోయే ఇంటర్మీడియట్, పై తరగతి పరీక్షా ఫలితాలలో విఫలం కాకుండా చదవాలనే కోరిక కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పెద్దవారు చెప్పిన విధంగా నేడు ఓటమి రేపటి గెలుపుకు గుర్తు అని విద్యార్థులకు తెలిపారు. ఉపాధ్యాయులు ఏర్పాటు చేస్తున్న స్టడీ అవర్ లను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.